క్లుప్తంగా

పార్కులు, గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు



మున్సిపల్ కమిషనర్ అయ్యప్పనాయుడితో చర్చిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీలోని పార్కులు, గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడికి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు సూచించారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్సీ కార్యాలయంలో కమిషనర్‌తో ఆయన మున్సిపాలిటీలో అభివృద్ధి పనులపై చర్చించారు. తాగునీటి సరఫరాను మరింత మెరుగు పరచాలని సూచించారు. సమావేశంలో 19వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిక్కాల రవిశంకర్, రెడ్డి సత్యనారాయణలు స్థానిక సమస్యలను వారికి విన్నవించుకున్నారు.

మణిపూర్‌లో హింసను అరికట్టాలి



అమలాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

అమలాపురం టౌన్: మణిపూర్‌లో హింసను తక్షణమే అరికట్టాలని, బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ అమలాపురం సెయింట్ జాన్స్ లూథరన్ చర్చ్ ఆధ్వర్యంలో పుర వీధుల్లో క్రైస్తవులు ఆదివారం ఉదయం ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ ఘటనల్లో దోషులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. గడియారం స్తంభం సెంటరులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీలో చర్చ్ పాస్టర్ డాక్టర్ సీహెచ్ ప్రకాష్ అంబేడ్కర్, క్రైస్తవ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

వంట సామగ్రి బహూకరణ



పాఠశాలకు అందజేసిన వంట సామగ్రితో సిబ్బంది

ముమ్మిడివరం: మండలంలోని ఠానేల్లంక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు ఐ.పోలవరం మండలం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతిరాజు రూ.15 వేల విలువ చేసే వంట సామగ్రి బహూకరించారు. వంట పాత్రలు, హెవీగేజ్ గ్యాస్ డబుల్ పొయ్యి, పది కుర్చీలను పాఠశాల ప్రిన్సిపాల్ టి.గంగాభవాని, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వడ్డి శ్యామ్ ప్రసాద్‌లకు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లవరం: గుడ్డివానిచింత–సామంతకుర్రు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ వైర్లు మార్చవలసిన పనుల నిమిత్తం అల్లవరం సబ్ స్టేషన్ పరిధిలోని గుడ్డివానిచింత, అల్లవరం, గుత్తులవారిపాలెం, సాపేవారిపేట గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రవికుమార్ ఆదివారం తెలిపారు.

బాల్య మిత్రునికి వితరణ

ఐ.పోలవరం: స్థానిక పితానివారిపాలెంనకు చెందిన గుత్తాల అన్నవరం పార్కిన్‌సన్స్ వ్యాధితో బాధపడుతుండడంతో అతడి బాల్య మిత్రులు ఆర్థిక సాయం చేశారు. ముమ్మిడివరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1970–75 మధ్యకాలంలో చదువుకున్న చిన్ననాటి స్నేహితులంతా గత నెల 8వ తేదీన కలుసుకున్నారు. ఈ సందర్భంగా పేదరికంతో ఉన్న 20 మంది చిన్ననాటి స్నేహితుల కోసం రూ.1 లక్ష రీయూనియన్ ఫండ్‌గా వీఎల్ నరసింహారావు, సత్యాల సుధాకర్‌లు సమకూర్చి ఇచ్చారు. ఆ రోజున అనారోగ్యంతో సమావేశానికి రాలేకపోయిన అన్నవరంకు ఆదివారం రూ.5 వేల సొమ్ము నరసింహారావు చేతుల మీదుగా అందజేశారు.

వ్యక్తి అదృశ్యం

కాట్రేనికోన: మండలంలోని బలుసుతిప్ప గ్రామానికి చెందిన దండుప్రోలు సత్యానందం (45) ఈ నెల 11వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో అతడి భార్య రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ టి.శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. సత్యానందం ఆచూకీ తెలిసినవారు 94409 00774 ఫోన్ నెంబరుకు సమాచారం అందివ్వాలని కోరారు.

నేడు పీఏసీఎస్ కమిటీ ప్రమాణ స్వీకారం

ఐ.పోలవరం: ఐ.పోలవరం పీఏసీఎస్ చైర్మన్, సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం సోమవారం జరగనుంది. చైర్మన్‌గా విత్తనాల శ్రీనివాసరావు, సభ్యులుగా దంగుడుబియ్యం గోపాలకృష్ణ, సాధనాల రాజేశ్వరి ప్రమాణస్వీకారం చేయనున్నారు.

రహదారులకు మహర్దశ

- రూ.25 కోట్లతో పేరూరు–ఓడలరేవు రోడ్డు విస్తరణ
- రూ.20 కోట్లతో గుడ్డివానిచింత – సామంతకుర్రు రోడ్డు పనులు



ప్రారంభమైన పేరూరు–గోడిలంక రోడ్డు విస్తరణ పనులు



విస్తరిస్తున్న గుడ్డివానిచింత–సామంతకుర్రు రోడ్డు

అల్లవరం: దశాబ్ద కాలంగా ఆధునీకరణకు నోచుకోని రెండు ప్రధాన రహదారుల విస్తరణకు ఎంపీ చింతా అనురాధ చొరవతో అడుగులు పడ్డాయి. అల్లవరం మండలంలోని పేరూరు వై జంక్షన్ నుంచి ఓడలరేవు వరకూ ఒక రహదారి, గుడ్డివానిచింత నుంచి సామంతకుర్రు వరకూ మరో రహదారి ఆధునీకరణకు ఎంపీ చింతా అనురాధ చొరవతో భారీగా నిధులు మంజూరయ్యాయి. ఈ రెండు రహదారుల విస్తరణ పూర్తయితే ఒక్క అల్లవరం మండలానికే కాకుండా చుట్టుపక్కల సుమారు 21 పంచాయతీలకు మేలు కలుగుతుందని ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విస్తరణ పనులు ప్రారంభం

- ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులు రూ.25 కోట్లతో మంజూరైన పేరూరు–గోడిలంక, బెండమూర్లంక, ఓడలరేవు రోడ్డు విస్తరణ పనులకు ఆగస్టు 11వ తేదీన అమలాపురం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. దీంతో శనివారం నుంచి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. ఇవి రెండు భాగాలుగా చేస్తున్నారు. రూ.17.5 కోట్లతో పేరూరు నుంచి గోడిలంక వరకూ పది మీటర్ల వెడల్పుతో తారు రోడ్డు వేయనున్నారు. అల్లవరం మసీదు సెంటర్ నుంచి హైస్కూల్ సెంటర్ వరకూ మరో 1.7 కిలోమీటర్ల పొడవునా 7 మీటర్ల వెడల్పున సీసీ రోడ్డుతో పాటు బెండమూర్లంక నుంచి ఓడలరేవు వరకూ పది మీటర్ల వెడల్పున తారురోడ్డు వేయనున్నారు.
- అల్లవరం మండలంలో రెండో ప్రధాన రహదారైన గుడ్డివానిచింత నుంచి సామంతకుర్రు వరకూ సుమారు పది కిలోమీటర్ల పొడవునా రోడ్డు విస్తరణ పనులు నెల రోజుల క్రితమే ప్రారంభించారు. రూ.20 కోట్ల సెంట్రల్ రోడ్డు ఫండ్స్ ద్వారా దేవగుప్తం, సామంతకుర్రు గ్రామాల్లో సీసీ రోడ్డు, మిగిలినది తారురోడ్డు వేయనున్నారు. ఎంట్రుకోన వద్ద కాలువపై ఇప్పటికే వంతెన నిర్మించి వినియోగంలోకి తెచ్చారు. వేసవి నాటికి ఈ రెండు ప్రధాన రహదారులు విస్తరణ పనులు పూర్తి చేసుకుని వినియోగంలోకి రానున్నాయని ఎంపీ చింతా అనురాధ తెలిపారు.



త్వరలో మరిన్ని రహదారులు

"అల్లవరం మండలంలో ప్రధాన రహదారులైన పేరూరు–ఓడలరేవు, గుడ్డివానిచింత–సామంతకుర్రు రోడ్డులను విస్తరిస్తున్నాం. ఇవే కాకుండా బోడసకుర్రు నుంచి బెండమూర్లంక వరకూ 10.4 కిలోమీటర్ల పొడవునా ఏటిగట్టుపై రోడ్డు, గురుకుల పాఠశాల నుంచి మొగళ్లమూరు, బీరవారిపేట మీదుగా కర్రిచెరువు వరకు 6.15 కిలోమీటర్ల పొడవునా తారు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకుని పనులు ప్రారంభం అవుతాయి." – చింతా అనురాధ, ఎంపీ

అసోసియేషన్ అధ్యక్షుడిగా సూర్య ప్రకాశరావు

అమలాపురం రూరల్: కోనసీమ కుకింగ్ అండ్ క్యాటరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సలాది సూర్యప్రకాశరావు ఎన్నికయ్యారు. ఆదివారం అమలాపురం సత్యనారాయణ గార్డెన్స్‌లో జరిగిన అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షులుగా గుడివాడ రాంబాబు, బోనం రామకృష్ణ, పిట్టా శంకర్రావు, కార్యదర్శిగా రావూరి సత్య కిరణ్, ఉపాధ్యక్షుడిగా బోనం వీరబాబు, సంయుక్త కార్యదర్శులుగా మోటుపల్లి ప్రసాద్, మొగలపల్లి శేఖర్, కోశాధికారిగా వేమా నరసింహరావు, గౌరవ సలహాదారులుగా నందుల దుర్గారావు, శనపల్లి దుర్గప్రసాద్ తదితరులు ఎంపికయ్యారు.

రేషన్ కార్డుల్లో 2,041 మంది అనర్హుల పేర్లు

యానాం: సివిల్ సప్లయిస్ శాఖ ద్వారా గతంలో జారీ చేసిన పలు రేషన్ కార్డుల్లో 2,041 మంది అనర్హుల పేర్లు ఉన్నట్లుగా తేలిందని రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సదరు 2,041 మంది గురించి క్షేత్రస్థాయిలో విచారిస్తే వారు యానాంలో నివసించడం లేదని నిర్ధారణ అయ్యిందన్నారు. వారంతా తమ నివాస ధ్రువపత్రాలతో ఇక్కడే నివసిస్తున్నట్లుగా నిరూపించుకోవాలని కోరారు. జాబితాలో పేర్లు ఉన్నవారంతా తమ నివాస, ఎస్‌టీసీ తదితర ధ్రువపత్రాలతో స్థానిక సివిల్ సప్లయిస్ ఆఫీసులో సంప్రదించాలని కోరారు.

సీఎం జగన్ వల్లే మాదిగలకు రాజకీయ గుర్తింపు

- ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్



బొమ్మి ఇజ్రాయిల్ దంపతులను సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

అమలాపురం రూరల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొలిసారి మాదిగలకు రాజకీయంగా గుర్తింపునిచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ, అసెంబ్లీ ఎస్సీ సంక్షేమ అభివృద్ధి కమిటీ సభ్యుడు బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. మండలంలోని నడిపూడిలో బాబూ జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ భవనంలో ఆదివారం రాత్రి జరిగిన సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ మాదిగలందరూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మద్దతివ్వాలని కోరారు. జగ్జీవన్‌రామ్ ఉద్యోగుల సంఘం సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మడి శ్రీరాములు, మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు పెనుమూడి జాన్సన్ బిల్లీ, మోకాటి నాగేశ్వరరావు, యార్లగడ్డ రవీంద్ర, కొల్లి సూర్యారావు, రాయి రాంబాబు, తొత్తరమూడి శ్రీనివాసరావు తదితరులు ఇజ్రాయిల్ దంపతులను ఘనంగా సత్కరించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



అమలాపురంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

అమలాపురం టౌన్: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో శ్రీభూనీలా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం శ్రీమాన్ పరాశ రఘునాథ బట్టర్ స్వామి పర్యవేక్షణలో ఆదివారం వైభవోపేతంగా జరిగింది. రాజమహేంద్రవరం శ్రీరంగ ధామంలో కొలువై ఉన్న పెరుమాళ్‌ని అమలాపురానికి తీసుకొచ్చి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కల్యాణ మహోత్సవంలో జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి, కార్యదర్శి కంచర్ల చిన్న వీరభద్రరావు, జిల్లా ఆర్యవైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు యెండూరి సీతామహాలక్ష్మి, యెండూరి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

అసోసియేషన్ సేవలు వెలకట్టలేనివి



అగ్నిప్రమాద బాధితుడికి సాయం అందజేస్తున్న ఏపీ ఎస్సీ వెల్ఫేర్ సభ్యులు

అయినవిల్లి: ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం అయినవిల్లి మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్.మూలపొలంలో అగ్ని ప్రమాదానికి గురైన యాళ్ల సత్తిబాబు కుటుంబానికి నిత్యావసరాలు, బట్టలు, వంట సామగ్రి, బియ్యం, కిరాణా సామగ్రిని అందించారు. ఎస్సీ వెల్ఫేర్ అధ్యక్షుడు జె.భీమారావు గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొబ్బా ప్రభాత్‌కుమార్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం అయినవిల్లి మండల శాఖ సేవలు వెలకట్టలేనివని అన్నారు. గతంలో కూడా గ్రామంలో అగ్ని ప్రమాద బాధితులకు సహాయ సహకారాలు అందించారని అన్నారు. కార్యక్రమంలో అయినవిల్లి సర్పంచ్ కాకర శ్రీనివాసరావు పాల్గొని సంక్షేమ సంఘం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, ఉపాధ్యక్షులు నేరేడుమిల్లి సత్యనారాయణ, సంఘ గౌరవ అధ్యక్షుడు వార నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వార సునీల్ కుమార్, ఆర్థిక కార్యదర్శి గుమ్మడి వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు



బాలయోగి స్టేడియంలో స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లు

యానాం: ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పాలనా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తుంది. క్రీడా మైదానంలో ఇప్పటికే టెంట్లు వేసి గ్యాలరీని సిద్ధం చేసి జాతీయ జెండాలతో సుందరంగా తీర్చిదిద్దారు. పుదుచ్చేరి పీడబ్ల్యూడీ మంత్రి లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఆర్ఏఓ మునిస్వామి తదితర అధికారులు స్వాతంత్య్ర వేడుకలకు హాజరుకానున్నారు. అదేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పోలీసు దళాలు, ఎన్‌సీసీ, స్కౌట్స్ తదితర విభాగాల వారు సైతం మార్చ్ ఫాస్ట్‌లో పదం తొక్కనున్నారు. ఆర్ఏఓ భవనం, మినీ సివిల్ స్టేషన్ భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

జాతీయ జెండాలతో పోలీసుల ర్యాలీ



జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

యానాం: ఆంగ్లేయుల నుంచి దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి 77 ఏళ్లు కావస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆదివారం యానాం పోలీసుశాఖ ఆధ్వర్యంలో వివిధ విభాగాల పోలీసులు జాతీయ జెండాలను చేతబూని పురవీధుల్లో భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేస్తూ స్వాతంత్య్ర దినోత్సవ ప్రాధాన్యతను వివరిస్తూ ముందుకు సాగారు.

డ్రైవర్ మాణిక్యాలుకు పదోన్నతి



స్పెషల్ గ్రేడ్ డ్రైవర్‌గా పదోన్నతి పొందిన మాణిక్యాలును సత్కరించిన అంబులెన్స్ డ్రైవర్లు

యానాం: యానాం ప్రభుత్వ ఆసుపత్రితో పాటు వివిధ శాఖల్లో 34 ఏళ్ల పాటు డ్రైవర్‌గా సేవలందించిన ఎ.మాణిక్యాలుకు స్పెషల్ గ్రేడ్ ఎల్ఎంవీ డ్రైవర్‌గా పదోన్నతినిస్తూ పుదుచ్చేరి డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్(పర్సనల్ వింగ్) కార్యదర్శి వి.జయశంకర్ ఆదివారం ఆదేశాలు ఉత్తర్వులిచ్చారు. పుదుచ్చేరి వ్యాప్తంగా అయిదుగురు డ్రైవర్‌లకు పదోన్నతి లభించగా యానాం నుంచి మాణిక్యాలు ఎంపిక కావడంపై స్థానిక వైద్యులు, అంబులెన్స్ డ్రైవర్లు ఆయనను అభినందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మసలయ్య, బొడ్డు ప్రసాద్, మట్టపర్తి వెంకటేశ్వరరావు, బాల, వేణు తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లిలో అష్టోత్తర పూజలు



స్వామికి అష్టోత్తర పూజలు చేస్తున్న భక్తులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి అష్టోత్తర పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి వారి అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు తమ కోర్కెలు నెరవేరడంతో స్వామి వారి అష్టోత్తర పూజల్లో అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

'రైతు నేస్తం'తో ఆర్థిక భరోసా

అంబాజీపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన రైతు నేస్తం పథకం ద్వారా రైతన్నలు ఆర్థిక పురోభివృద్ధి చెందేందుకు భరోసా కలుగుతుందని సొసైటీ చైర్మన్ దొమ్మేటి సత్యమోహన్ ఆదివారం చెప్పారు. రైతునేస్తం పథకం ద్వారా సంఘ సభ్యులకు ఎకరాకు రూ.8 లక్షల రుణాన్ని 12 శాతం వడ్డీతో పదేళ్ల కాల పరిమితికి డీసీసీబీ ద్వారా అందిస్తున్నామన్నారు. గరిష్ఠంగా రూ.20 లక్షల వరకూ రుణం పొందవచ్చన్నారు. ఈ పథకాన్ని సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకుని సొసైటీ అభివృద్ధితో పాటు, రైతులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి సహకరించాలన్నారు. సొసైటీ సీఈఓ కుంపట్ల అయ్యప్పనాయుడు మాట్లాడుతూ అంబాజీపేట సహకార సంఘంలో 1150 సభ్యులున్నారని, వీరిలో 650 మంది సభ్యులు పంట రుణాలు, మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలు పొందారన్నారు. సంఘం ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సరఫరా చేస్తున్నామన్నారు. ఆర్బీకేలకు సపోర్టింగ్ ఏజెన్సీగా ఉంటూ రబీ, ఖరీఫ్ సీజన్లలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. జేఎల్జీ గ్రూపుల్లో ఒక్కో గ్రూపునకు రూ.లక్ష రుణసౌకర్యం, సేవింగ్స్, రికరింగ్ డిపాజిట్ అకౌంట్ ద్వారా పొదుపు చేసుకునే సదుపాయం, సంఘ సభ్యులకు లాకర్ సదుపాయం, ప్రభుత్వం నిర్ణయించి ధరలకే మీ సేవ ద్వారా ప్రభుత్వ సేవ, తక్కువ వడ్డీకే బంగారు నగల హామీపై రుణాల సదుపాయం కల్పిస్తున్నామన్నారు.

హిందూ ధర్మాన్ని అందరూ అనుసరించాలి



కొత్తపేటలో జనజాగరణ సదస్సులో మాట్లాడుతున్న బీజేపీ నేత పాలూరి

కొత్తపేట: హిందూ ధర్మాన్ని అందరూ అనుసరించాలని బీజేపీ స్వచ్ఛభారత్ రాష్ట్ర కన్వీనర్ పాలూరి సత్యానందం, ఆర్ఎస్ఎస్ బౌద్ధ ప్రముఖ్ తొగరు సీతారామాంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గ్రామ దేవత బంగారమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఆర్ఎస్ఎస్ హిందూ జనజాగరణ సదస్సు నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ విశ్వ హిందూ పరిషత్ ఆలయాలు, అర్చక సమాఖ్య జిల్లా ప్రముఖ్ కోటిపల్లి వెంకటసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సత్యానందం, ఆంజనేయులు, మండల బీజేపీ అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి పాల్గొన్నారు. వారు పిల్లలు, పెద్దలు, హిందూ బంధువులకు హైందవ ధర్మం, సంస్కృతి, సాంప్రదాయాల గురించి వివరించారు. హిందూ ధర్మమే భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలిపిందన్నారు. ఆధ్యాత్మిక భక్తిని, మానసిక తృప్తిని, శారీరక ఆరోగ్యాన్ని, తద్వారా జీవితాన్ని సార్థకం చేసుకునే ఏకైక మార్గం హిందూ ధర్మం అని అన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, హిందూ బంధువులు, బాలలు పాల్గొన్నారు.

సహాయ నిరాకరణ అధికారులకు బదిలీ

యానాం: ప్రభుత్వానికి, వివిధ పథకాల అమలుకు సహకరించని కేంద్రంచే నియమితులైన పుదుచ్చేరి సివిల్ సర్వీస్(పీసీఎస్) కేడర్ అధికారులను, తమిళం మాట్లాడే పలువురు ఉన్నతాధికారులను బదిలీ చేయడానికి నిర్ణయం తీసుకున్నామని స్పీకర్ ఆర్.సెల్వం పేర్కొన్నారు. ఆదివారం ఆయన లెజిస్లేటివ్ అసెంబ్లీ చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. పీసీఎస్ అధికారులెవరూ వివిధ ప్రభుత్వ పథకాల అమలుకు తనకు సహకరించడం లేదని సీఎం రంగసామి తనకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ నేపథ్యంలో సహకరించని అధికారులను బదిలీ చేస్తామన్నారు. మరికొద్దిమంది ఐఏఎస్ అధికారులు సైతం ఆ విధంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు

కొత్తపేట: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన, ఆహార ఉత్పత్తులు పండించాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు రైతులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయం వానపల్లి యూనిట్ ఆధ్వర్యంలో బిళ్లకుర్రులో శనివారం ప్రధానమంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన (పీఎంఏజేఏవై) పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయ చేస్తున్న షెడ్యూల్డ్ కులాల రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 12 రకాల నవధాన్యాలు, చిరుధాన్యాలు, 10 రకాల కూరగాయల విత్తనాలు పంపిణీ, ఇతర రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎంపీపీ గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. యూనిట్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వరరావు ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయానికి వివిధ ప్రోత్సాహకాలు అందిస్తున్నాయన్నారు. బిళ్లకుర్రు పంచాయతీ పరిధిలో సుమారు 400 ఎకరాలు గుర్తించినట్టు తెలిపారు. బిళ్లకుర్రు యూనిట్ పరిధిలో 30 (300 కేజీలు) విత్తనాలు కిట్స్ రాగా 30 మంది రైతులకు ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మంగిపూడి శ్రీరామచంద్రమూర్తి, ఫార్మర్ సైంటిస్టు అరుణకుమారి పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేశాం



మగటపల్లిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మామిడికుదురు: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీనీ అమలు చేశామని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మగటపల్లిలో ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే వరప్రసాదరావు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడిగే హక్కు కేవలం వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సీఎం జగన్ ప్రజలకు ఇచ్చిన మాట తప్పలేదు, మడమ తిప్పలేదని రాపాక పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, నాయకులు సూరిశెట్టి బాబి, కుసుమ శ్రీధర్, బందారు పండు, వేలంగి గంగాధర్, కలిగితి రామకృష్ణ, కుసుమ పెరుమాళ్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు 96 మంది విద్యార్థులు



ఇంటర్వ్యూకు హాజరైన కొత్తపేట విద్యార్థులు

కొత్తపేట: డిగ్రీ పూర్తయిన విద్యార్థులకు రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహా జాబ్‌మేళాకు స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి 96 మంది విద్యార్థులు హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. చదువుకున్న ప్రతి విద్యార్థికి ఆ చదువుకు తగ్గ ఉద్యోగం కల్పించాలనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యాన్ని అనుసరించి రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు శనివారం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల (అటానమస్), తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (నోడల్ రిసోర్స్ సెంటర్స్) పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ పూర్తయిన విద్యార్థులకు మహా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు, వైస్ ప్రిన్సిపాల్, ప్లేస్మెంట్ ఆఫీసర్ టి.రమాదేవి, అధ్యాపక బృందం ఆధ్వర్యంలో 96 మంది విద్యార్థులు హాజరయ్యారు. దేశ వ్యాప్తంగా అనేక కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఎంపికైన విద్యార్థులకు రెండు, మూడు రోజుల్లో నియామక పత్రాలు అందజేస్తామని ఆయా కంపెనీల హెచ్ఆర్‌ఓలు తెలిపినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు తెలిపారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి

అమలాపురం రూరల్: ఈ నెల 18న అమలాపురంలో జరగనున్న టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని నియోజక వర్గ పరిశీలకుడు పెచ్చెట్టి బాబు పిలుపునిచ్చారు. ఆదివారం టీడీపీ మండల పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధానాలను చంద్రబాబు వివరిస్తారన్నారు. కార్యక్రమంలో అమలాపురం టీడీపీ ఇన్‌చార్జ్ అయితాబత్తుల ఆనందరావు, పార్టీ పరిశీలకుడు బాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

మన ఆంధ్రా.. మన ఏపీఎల్ 3కే రన్



అంబాజీపేటలో 3కే రన్ ర్యాలీని నిర్వహిస్తున్న క్రికెట్ క్రీడాకారులు

అంబాజీపేట: మన ఆంధ్రా.. మన ఏపీఎల్ సీజన్–2ను పురస్కరించుకుని ఓ లెవెల్ క్రికెట్ కోచ్ మట్టా సత్తిబాబు ఆధ్వర్యంలో అంబాజీపేటలో 3కే రన్‌ను ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు ఎస్.వెంకటేశ్వరరావు టార్చ్‌ను వెలిగించి ఈ రన్‌ను ప్రారంభించారు. కోచ్ సత్తిబాబు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఐపీఎల్, ఏపీఎల్‌కు క్రికెట్ క్రీడాకారులను తయారు చేయడమే కోనసీమ సబ్ సెంటర్ క్రికెట్ కోచింగ్ ప్రధాన లక్ష్యమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో వైజాగ్‌లో ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకు ఆంధ్రా ప్రీమియర్ లీగ్ సీజన్–2ను నిర్వహిస్తున్నట్లు సత్తిబాబు తెలిపారు. అంతకు ముందు స్థానిక జెడ్పీ హైస్కూల్ నుంచి ప్రారంభమైన 3కే రన్‌ను స్థానిక నాలుగు రోడ్ల సెంటర్ వరకు సాగింది. కార్యక్రమంలో కొర్లపాటి వెంకటేశ్వరరావు, క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.